నేటి కందం- నేటికి అందం



దయయును,దాక్షిణ్య మ్మ
క్షయమగు నోరిమియు సంతసము నిడు ననుచున్
స్వయముగ మన చిన జియ్యరు
నియతాత్ముండగుచు జర్మనీలో దెలిపెన్ !!

చినజీయర్" స్వామి "జర్మనీ"లో పర్యటిస్తూ రాముని విశేషాలను,మానవుని కర్తవ్యాలను వివరించారు



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటినిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

కేంద్ర పార్టీ ఎంపీలు
కొట్లాడిందేముంది
తెలంగాణ అభివృద్ధికి
తెచ్చిందేమున్నది
ప్రాజెక్టుల సాధనలో
ప్రయత్నాలు శూన్యం
నమ్మకంగా గలిపిస్తే
నయవంచన దైన్యం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 23-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001.సంపుటి :31 సంచిక:261 పేజీలు:6 వెల: రూ.1/-

## ఉపరాష్ట్రపతి రాజీనామాను ఆమోదించిన ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము

### - ఉపరాష్ట్రపతి రాజీనామాపై స్పందించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

### - మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్ష



న్యూ డిల్లీ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాను ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము ఆమోదించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి ముర్ము ఫైల్ పై సంతకం చేసింది. ఆ తర్వాత ఆ రాజీనామాను కేంద్ర హోంమంత్రిత్వ శాఖకి పంపారు. అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్ ఖడ్ రాజీనామా చేయగా .. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రదాని మోడీ వ్యాఖ్యనించారు. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయన్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

హోంశాఖ ఇచ్చిన సమాచారాన్ని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ శ్రీ ఘన్‌శ్యామ్ తివారీకి సభలోని సభ్యులకు తెలియజేశారు. కాగా జగదీప్ ధన్‌కడ్ ఆనారోగ్య కారణాలు చూపుతూ సోమవారం రాత్రి తన పదవికి రాజీనామా చేశారు. ఆ రాజీనామాకు ఇవాళ రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఉపరాష్ట్రపతి రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన విషయాన్ని సభ్యులకు తెలియజేసిన తర్వాత రాజ్యసభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

## బీసీ సంఘాలు బీజేపీ నిజస్వరూపం తెలుసుకోండి

### -మంత్రి పొన్నం

హైదరాబాద్, జులై 22: రిజర్వేషన్ విషయంలో బీసీ సంఘాలు బీజేపీ నిజస్వరూపం తెలుసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉదయం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యం అంటున్నారని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమే.. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో జరిగిందని ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే ఎందుకు రిజర్వేషన్లు అమలు కావో చూస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత ముఖ్యమంత్రి రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్సీ, పీసీసీ అధ్యక్షుడు బీసీలకు చెందిన వారు ఉన్నారని చెప్పారు.

### సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని

సుప్రీంకోర్టులో ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పిందని, రాష్ట్రాల దగ్గర ప్రామాణికమైన సమాచారం ఉంటే.. ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించిందని పొన్నం గుర్తు చేశారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్ ఆమోదం, శాసనసభ ఆమోదం, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీలో ఉందన్నారు. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వం అని అన్నారు. తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలోని అన్ని బీసీ వర్గాలు, కుల సంఘాలు బీజేపీ నిజస్వరూపాన్ని గమనించి రిజర్వేషన్లు ప్రక్రియను కాపాడుకునే దానిలో ముందుండాలని కోరారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తప్పకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిందే అని డిమాండ్ చేశారు.

## కొండంత చేసినా గోరంత చెప్పుకోలేకపోతున్నాం-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జులై 22:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నోసంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో చెయ్యనివాటిని చేసినట్లుగా గోబెల్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసినదాన్ని కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతుందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సీఎం ఆలోచనలకు అనుగుణంగా..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతో చేసినప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేకపోతున్నామని అన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టామని , 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు.



మహిళ సంక్షేమానికి అనేక పథకాలు

మహిళ సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టామని మంత్రి పొంగులేటి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపించామన్నారు. పదేళ్లలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదు చేయలేదన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరు నమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశామన్నారు. కొత్తగా ఏడు లక్షల రేషన్ కార్డులిచ్చామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారుల దేనని ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు

## ఉప రాష్ట్రపతి తన పదవికి రాజీనామాతో దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు

న్యూ డిల్లీ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసారు.సోమవారం ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది.పది రోజుల క్రితమే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధన్‌ఖర్ ప్రస్తుతం పూర్తికాలం ఉప రాష్ట్రపతి పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. జులై 10న జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమ ంలో ప్రసంగిస్తూ.. 'నేను ఆగస్టు 2027లో సరైన సమయంలో దైవ నిర్ణయానికి లోబడి పదవీ విరమణ చేస్తాను' అని స్పష్టం చేశారు. ఆయన 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే, పది రోజుల క్రితం పూర్తి కాలం ఈ పదవిలో కొనసాగుతానని చెప్పిన ఆయన.. ఇప్పుడు అనూహ్యంగా రాజీనామా చేయడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్రంగా చర్చ నడుస్తోంది.ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.

## దూసుకొస్తున్న విపా తుపాన్ ..ఏపిలోని తీర ప్రాంత జిల్లాల్లో హై అలెర్ట్


విశాఖ, జులై 22: మరో 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. చైనా-హాంకాంగ్ లో బీభత్సం సృష్టించిన విఫా తుఫాన్..బంగాళాఖాతంలోకి ప్రవేశించిందని పేర్కొంది. తుఫాన్ కారణంగా రాబోయే 3 రోజుల పాటు ఏపీలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది.ఉత్తర బంగాళాఖాతంలో మరో 24 గంటల్లో అల్పపీడనం



ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విఫా తుఫాన్ చైనా, హాంకాంగ్ ప్రాంతాల్లో బీభత్సం సృష్టించింది.. అది తీరం దాటి బంగాళాఖాతంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ప్రస్తుతం తుఫానుగా రూపాంతరం చెందింది. ఈ అల్పపీడనం క్రమేపీ బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

ఈ క్రమంలో వచ్చే మూడు రోజులు ఏపీలో విస్తారంగా వర్షాలు, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం తీరం వెంబడి గంటకు 60 కి.మీ గరిష్ఠ వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత 24 గంటల్లో గుంటూరు, మాచర్ల, నర్సీపట్నంలో 7 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోండి.. శ్రీశైల ఈవో ఆదేశాలు



శ్రీశైలం, జులై 22: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీశైల ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఈవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందు జాగ్రత్తలన్నింటిని తీసుకోవాలని సూచించారు. ఎక్కడ కూడా చెత్తాచెదారాలు ఉండకుండా విస్తృత పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. క్షేత్రపరిధిలో ఎక్కడ కూడా వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా దోమలు ప్రబలకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

మంచినీరు కలుషితం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఈవో ఆదేశించారు. శాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా నీటిని క్లోరినేషన్ చేస్తుండాలని సూచించారు. క్షేత్ర పరిధిలోని మంచినీటి ట్యాంకులన్నింటినీ క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. మంచినీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నందు ప్రతీరోజు కూడా టీడీఎస్ తనిఖీ చేయాలన్నారు. దేవస్థానం వైద్యశాలలో అవసరమైన అన్ని మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అవసరాన్నిబట్టి ఆయా మందుల ఇండెంటులను ముందస్తుగానే వైద్యశాల విభాగాధికారికి అందజేయాలని దేవస్థానం వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అపోలో డాక్టర్లను ఆదేశించారు.

వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, మరిగించి చల్లార్చిన నీటిని తాగడం, ఇళ్ళలోనూ, ఇంటి పరిసరాలను నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్త వడడంలాంటి అంశాలపై స్థానికులలో అవగాహన కలిగించాలని దేవస్థాన వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య వైద్యులను సూచించారు. ఈ విషయమై దేవస్థాన ప్రసార వ్యవస్థ ద్వారా (మైకు ద్వారా) కూడా స్థానికులలో అవగాహన కల్పించనున్నారు. ఇదే విషయంలో ప్రజలకు అవగాహన కలిగించేందుకు క్షేత్రపరిధిలో ప్రధాన కూడళ్లు, ఇతర ప్రదేశాలలో తగు బోర్డులను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కరపత్రాల ద్వారా కూడా ప్రచారం కల్పించాలని శ్రీశైలప్రభ విభాగాన్ని ఆదేశించారు.

దేవస్థాన అన్ని విభాగాలు, దేవస్థానం వైద్యశాల సిబ్బంది, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందరు కూడా సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈవో ఆదేశించారు.

సమాచార వినిమయం కోసం దేవస్థానం సంబంధిత విభాగాల అధికారులు, దేవస్థానం వైద్యశాల వైద్యులు, సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, స్థానిక ఆయుర్వేద వైద్యాధికారి, సిబ్బందికి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని దేవస్థానం ఐటీ విభాగాన్ని ఆదేశించారు. విధినిర్వహణలో పరస్పర సమన్వయం కోసం ఈ వాట్సావ్ గ్రూపును వినియోగించుకోవచ్చునని అన్నారు.

## ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజి టెట్ 2025) ఫలితాలు విడుదల

-హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజి టెట్ 2025) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ రోజు ఉదయం 11 గంటలకు సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా టెట్ ఫలితాలను విడుదల చేశారు. జూన్ 18 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్షలు జరిగాయి. పేపర్ 1కు 63,261 మంది దరఖాస్తు చేసుకోగా, 47,224 మంది(74.65 శాతం) హాజరయ్యారు. అలాగే పేపర్ 2(మ్యాథ్స్ అండ్ సైన్స్)కు 66,686 మందికి గానూ 48,998 మంది(73.48) హాజరు కాగా, పేపర్ 2(సోషల్ స్టడీస్)కు 53,706 మందికిగానూ 41,207 మంది(76.73 శాతం) మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 1,37,429 మంది పరీక్షలు రాశారు.

## చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి చదువుపై దృష్టి పెట్టాలి : దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్

మెదక్, జులై 22:విద్యతోనే సమాజంలో విద్యార్థులకు మంచి గుర్తింపు వస్తుందని చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి చదువులో రాణించాలని అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాత వంగ మహేందర్ రెడ్డి సహకారంతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంపై, సైబర్ మోసాల గురించి తగిన సూచనలు చేశారు. మోటార్ సైకిల్ వినియోగించినప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు గుర్తు చేయాలన్నారు. 18 సంవత్సరాల లోపు విద్యార్థులు మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేయకూడదని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచనలు చేశారు.

ప్రధానోపాధ్యాయులు బాసిత్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాజేశ్వర్, మధుర కవి, శ్రీధర్, యాదగిరి కిషన్ రెడ్డి, రాజు, రమేష్, సాగరిక, చందు, కల్యాణి పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ఫుడ్ పాయిజనింగ్..

### ఆసుపత్రిపాలైన మరో ఏడుగురు

### -ఇద్దరి పిస్థితి విషమం

హైదరాబాద్, జులై 22:హైదరాబాద్ వనస్థలిపురంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఫుడ్ పాయిజన్ కారణంగా ఆర్టీసీ ఉద్యోగి శ్రీనివాస్ మృతి చెందారు. అదే సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో మరో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

బోనాల పండగ సందర్భంగా వండిన మటన్, బోటి, చికెన్ ఫ్రిజ్‌లో ఉంచి ఆ తరువాత తినడంతో ఫుడ్ పాయిజన్ అయినట్లు తెలుస్తోంది. అస్వస్థతకు గురైన వారిని రజిత (38), జస్విత (15), గౌరమ్మ (65), లహరి (17), సంతోష్ కుమార్ (39), రాధిక (38), బేబీ కృతాంగ (7)లుగా గుర్తించారు.

ఈ ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన వారిని చింతలకుంటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఫుడ్ పాయిజన్ జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు మరోసారి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్, జులై 22: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లవేళల అందుబాటులో ఉంటానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడ డివిజన్ కాచిగూడ, బర్కత్‌పుర, తదితర బస్తీలలో ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ ఉమారమేశ్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బస్తీవాసులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా లోప్రెషర్‌తో నీటి సమస్య తలెత్తుతుందని, స్పీడ్‌బ్రేకర్లు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాననని హామీ ఇచ్చారు. ఏ డివిజన్‌లోనైన డ్రైనేజీ,నీటి సమస్య వచ్చిన వెంటనే అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

నియోజకవర్గంలోని డివిజన్‌లను అభివృద్ధిచేస్తూ, మౌళిక సదుపాయలు కల్పించేందుకు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఆయన వెంట జలమండలి డీజీఎం కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, కన్నె రమేశ్‌యాదవ్, డాక్టర్ శిరీషాయాదవ్, ఓం ప్రకాశ్‌యాదవ్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, సుభాశ్‌పటేల్, బబ్లూసింగ్,అరవింద్, మహేశ్ కుమార్, శ్రీకాంత్‌యాదవ్,అంటో, మల్లికార్జున్, బి.కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

## జైలు గోడల నడుమ నిర్బంధంలోనూ తెలంగాణ నినాదాన్ని వినిపించిన దాశరథి

### -కొనియాడిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నా తెలంగాణ కోటి రతనాల వీణ' ? అంటూ తెలంగాణ గరిమను, తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిన గొప్ప తెలంగాణ కవి, దాశరథి కృష్ణమాచార్య అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు.. దాశరథి శత జయంతి సందర్భంగా వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. కవిగా, రచయితగా, తెలంగాణ అస్మితను, తన ప్రాంత ప్రజల కష్టాలను, ప్రపంచానికి వినిపించిన తెలంగాణ గర్వించదగ్గ భూమి పుత్రుడు దాశరథి అని కేసీఆర్ అన్నారు. జైలు గోడల నడుమ నిర్బంధంలోనూ తెలంగాణ నినాదాన్ని వినిపించిన గొప్ప వ్యక్తి దాశరథి అని అన్నారు.. పీడితులు దుఃఖితుల కోసం తన కలాన్ని అందించిన దాశరథి కృష్ణమాచార్య కృషిని రేపటి తరాలు గుర్తు చేసుకునేలా, వారి పేరున అవార్డును నెలకొల్పి ప్రతీయేటా వారి జయంతి రోజున లబ్ద ప్రతిష్టులైన సాహిత్యకారులకు అందించాలని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించి అమలు చేసిందని కేసీఆర్ అన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించడం ద్వారా మాత్రమే వారికి మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ తెలిపారు.

# మహిళా భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్



నంద్యాల, జులై 22:: మహిళా భద్రతకు రాష్ట్ర ప్రభుత్వంఅనేక చట్టాలు రూపొందించడం జరిగిందని, వాటి పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమం, వైద్యారోగ్యం, జీఎస్ డబ్ల్యూఎస్ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, కళాశాల అమ్మాయిలతో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ అధ్యక్షతన మహిళల సంక్షేమం, రక్షణ, భద్రత, హక్కులు, మహిళా సాధికారత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళా కమిషన్ బాధ్యతలో భాగంగా మహిళా భద్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కేవలం ఏదైనా ఒక ఘటన జరిగినప్పుడే కాకుండా వాటిని పూర్తి స్థాయిలో నివారించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక కార్యక్రమాలు కూడా చేపట్టడం జరుగుతోందన్నారు. రాయలసీమ జిల్లాల్లో విద్యార్థినీలకు మహిళా భద్రత, సాధికారతపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఆమె ఇంకా పలు కేసులకు సంబంధించిన మాట్లాడారు. అలాగే జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, అడిషనల్ ఎస్పీ జావలి మాట్లాడారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యురాలు బేగం, ఐసీడీఎస్ పీడీ లీలావతి, సీడీపీవోలు, అనుబంధ శాఖల అధికారులు, కళాశాల యువతులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి.. లోకాయుక్తకు వినతి

కర్నూలుజులై 22: ఆంధ్రప్రభ : పోలవరం ప్రాజెక్టు పున నిర్మాణ ప్యాకేజీ కింద నిర్వాసితులకు సరైన పరిహారం అందజేయడం ద్వారా పౌరుల హక్కులను పరిరక్షించడంలో ఏపీ లోకాయుక్త, ఉప-లోకాయుక్త సంస్థ మరోసారి కీలక పాత్ర వహించింది. పోలవరం ప్రాజెక్టు క్రింద ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రయోజనాల నుండి తమను మినహాయించడంపై నల్లాల వెంకటరమణమ్మ నల్లాల శేషగిరి దాఖలు చేసిన కర్నూల్లోని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కేసు నెంబర్లు 61/2019/బి1, 62/2019/బిలలో నమోదు చేశారు.

ఫిర్యాదిదారుల నివాసాలు ప్రభావిత ముంపు ప్రాంతంలో ఉన్నప్పటికీ ఫిర్యాదు చేసిన వారిని లబ్దిదారుల జాబితాలో చేర్చలేదన్న విషయాన్ని గ్రహించారు. దీంతో ఈ విషయంలో లోకాయుక్త సంస్థ జోక్యం చేసుకుంది. తరువాత ప్రాజెక్టు నిర్వాహకుడు, ఎక్స్ ఆఫీషియో జాయింట్ కలెక్టర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, ధవళేశ్వరం వారు ఫిర్యాదిదారులను సప్లమెంటరీ డ్రాఫ్ట్ ఆర్ అండ్ ఆర్ పథకంలో చేశారని, ఫిర్యాదిదారులకు ఇంటిస్థలం కేటాయింపుతో పాటు రూ.6,36 లక్షల నగదు, రూ.25వేల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి కింద చెల్లించబడిందని నిర్ధారిస్తూ, చర్య తీసుకున్నారని నివేదికను సమర్పించారు.

# ఉగ్రవాదం వెనుక ఉన్న సూత్రధారులను వారు దాగి ఉన్న స్థలాల్లోనే మట్టుబెట్టారు: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 22:పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆరంభం కావడానికి ముందు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పార్లమెంట్ ఆవరణలో ప్రసార మాధ్యమాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. వర్షాకాల సమావేశాలకు ప్రతి ఒక్కరికీ స్వాగతం అని ఆయన అన్నారు. వర్షాకాలం అంటే నవకల్పనకు, పునరుద్ధరణకు ప్రతీక అని అభివర్ణించారు. 'ప్రస్తుతం దేశం నలుమూలలా వాతావరణ స్థితిగతులు అనుకూలిస్తున్నాయి, ఇది పంటలకు ప్రయోజనకరమంటూ ముందస్తు అంచనాలు వెలువడుతున్నాయి' అని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. వర్షపాతం ఒక్క గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కీలకం కాదని, దేశ సమగ్ర ఆర్థిక వ్యవస్థకు, ప్రతి కుటుంబ ఆర్థిక శ్రేయానికీ వానలు ముఖ్యమని చెప్పారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న సమాచారాన్ని బట్టి చూస్తే ఈ ఏడాది జలాశయాల్లో నీటిమట్టం స్థాయిలు గత పది సంవత్సరాలతో పోలిస్తే మూడింతలు అయ్యాయని శ్రీ మోదీ తెలిపారు. ఈ వృద్ధి రాబోయే కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థకు చెప్పుకోదగ్గ స్థాయిలో మేలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

"ప్రస్తుత వర్షాకాల సమావేశాలు భారత ప్రజలకు గర్వకారక ఘట్టం, ఈ సందర్భం దేశం తన గెలుపును పండుగ చేసుకోవడానికి ఒక ప్రతీకగా ఉండబోతోంది" అని ప్రధానమంత్రి అన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మొట్టమొదటిసారి భారత మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన చరిత్రాత్మక క్షణాన్ని ఆయన గుర్తు చేసి, ఇది దేశంలో అందరికీ అమిత సంతోషదాయక విషయమంటూ అభివర్ణించారు. ఈ విజయం దేశవ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ, నవకల్పనల రంగాల్లో ఒక సరికొత్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగించిందని స్పష్టం చేశారు. ఈ ఘనతను సాధించడం పట్ల పూర్తి పార్లమెంటు.. ఇటు లోక్ సభ, అటు రాజ్య సభ.. వీటితో పాటు మన దేశ ప్రజలంతా తమ ఆనందాన్ని ఒక్కుమ్మడిగా వ్యక్తం చేస్తున్నారని శ్రీ మోదీ తెలిపారు. ఈ సమష్టి సంబరాలు ఇండియా రాబోయే కాలంలో చేపట్టే అంతరిక్ష అన్వేషణ సాహసయాత్రలకు ప్రేరణగా నిలవడంతో పాటు ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.

భారత్ సాధించిన విజయాలను పండుగ చేసుకొనే సందర్భమే ఈ వర్షాకాల సమావేశాలు అని శ్రీ మోదీ అభివర్ణించారు. భారత్ సాయుధ దళాల శక్తి సామర్థ్యాలను ప్రపంచం గమనించిందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ, భారతీయ సైన్యం లక్ష్యాల వైపునకు గురిపెట్టి 100 శాతం గెలుపు సాధించిందని ప్రధానంగా చెప్పారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టి, 22 నిమిషాల్లో భారత్ బలగాలు పేరుమోసిన లక్ష్యాలను స్థావరాల వారీగా నామరూపాలు లేకుండా నాశనం చేశాయని ఆయన ఉద్ఘాటించారు. ఈ ఆపరేషన్‌ను గురించి బీహార్‌లో ఒక జనసభలో తాను ప్రస్తావించానని, సాయుధ దళాలు తమ చేవను వెనువెంటనే నిరూపించాయని గుర్తు చేశారు. రక్షణ రంగంలో భారత్ "మేడ్ ఇన్ ఇండియా'' శక్తియుక్తులను ప్రదర్శిస్తుంటే, ఈ అంశంలో ప్రపంచ దేశాల ఆసక్తి అంతకంతకు పెరుగుతోందని ప్రధానమంత్రి వివరించారు. ఇటీవల తాను వివిధ దేశాల నేతలతో జరిపిన ముఖాముఖి చర్చల్లో భారత్ సైనిక సామగ్రిని దేశీయంగానే తయారు చేసుకొన్నందుకు వారు ప్రశంసలు కురిపించారని శ్రీ మోదీ తెలిపారు. ఈ విజయాన్ని పండుగ చేసుకోవడానికి వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభలు తమ వాణిని ఏక స్వరంతో వినిపిస్తాయన్న విశ్వాసం తనకుందన్నారు. ఇది భారత సైనిక శక్తికి మరింత ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇవ్వగలదని ఆయన అన్నారు. ఈ సామూహిక భావన పౌరులకు కూడా స్ఫూర్తిదాయకం అవుతుందని, రక్షణ రంగంలో పరిశోధన, నవకల్పన, తయారీలకు కొత్త వేగాన్ని జతపరచడంతో పాటు దేశ యువతకు నూతన ఉద్యోగావకాశాలను కల్పించగలదని ప్రధానమంత్రి అన్నారు.

శాంతి, ప్రగతి చెట్టపట్టాల్ వేసుకొని ముందుకు సాగిపోవడానికి ఈ దశాబ్దం ప్రతీకగా నిలిచిందని, అడుగడుగున అభివృద్ధి భావన ఉట్టిపడుతోందని ప్రధానమంత్రి అన్నారు. "దేశం చాలా కాలంగా వివిధ హింసాత్మక సంఘటనలతో సతమతం అయింది.. అవి ఉగ్రవాద దాడులు కావచ్చు, లేదా నక్సలిజం కావచ్చు.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇవి కొనసాగుతూవచ్చాయి'' అని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. నక్సలిజం, మావోయిజం జాడలు ఇప్పుడు వేగంగా కుదించుకుపోతున్నాయని వ్యాఖ్యానించిన శ్రీ మోదీ.. దేశ భద్రతా దళాలు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఇదివరకటి కంటే ఎక్కువ ఉత్సాహంతో ప్రస్తుతం నక్సలిజాన్ని, మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించే లక్ష్యం వైపు స్థిరంగా ముందుకు కదులుతున్నాయని చెప్పారు. నక్సల్ హింస పట్టు నుంచి బయటపడడంతో, దేశంలో వందలాది జిల్లాలు ఇక స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకొంటున్నాయని ఆయన సగర్వంగా చాటిచెప్పారు. ఆయుధాలపైనా, హింసపైనా భారత రాజ్యాంగానిదే పైచేయి అవుతోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ఇదివరకటి 'రెడ్ కారిడార్' ప్రాంతాలు ప్రస్తుతం 'గ్రీన్ గ్రోత్ జోన్స్' (పచ్చదనంతో కళకళలాడుతున్న అభివృద్ధి మండలాలు)గా స్పష్టమైన మార్పును సంతరించుకొంటూ, దేశానికి భవిష్యత్తు ఆశాభరితంగా ఉండనడానికి సూచికగా నిలుస్తున్నాయని ఆయన వివరించారు.

ఈ ఘట్టాలలో ప్రతి ఘట్టం వెనుకా దేశమంటే భక్తి, ప్రజాసంక్షేమం పట్ల అంకిత భావం ఉట్టిపడుతున్నాయని ప్రధానమంత్రి చెప్తూ, ఈ ఘట్టాలు పార్లమెంటులో ప్రతి ఒక్క సభ్యునికి, సభ్యురాలికి గర్వకారణమైన ఘట్టాలేనని అభివర్ణించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రతి రాజకీయపక్షానికి చెందిన ప్రతి ఎంపీ వ్యక్తం చేసే అభిప్రాయం జాతి గర్వపడుతున్న ఈ విజయోత్సవానికి జయ ఘోషగా మారి, యావత్తు దేశ పౌరుల చెవులకు సోకగలదని శ్రీ మోదీ అన్నారు.

తమ ప్రభుత్వం 2014లో పాలన పగ్గాలను అందుకొన్నప్పుడు, భారత్ సులువుగా దెబ్బతినగల అయిదు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందని ప్రధానమంత్రి చెప్పారు. ఆ కాలంలో, ప్రపంచ ఆర్థిక ర్యాంకింగుల్లో భారత్ 10వ స్థానంలో ఉందని, అయితే ప్రస్తుతం ఇండియా శరవేగంగా దూసుకుపోతూ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే స్థితికి చేరువ అవుతోందన్నారు. 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటకు వచ్చారు, ఈ మార్పును ప్రపంచ సంస్థలు అనేకం గుర్తించి, అభినందించాయని ఆయన స్పష్టం చేశారు. 2014 కంటే ముందు, భారత్ రెండంకెల ద్రవ్యోల్బణంతో అల్లాడిందని శ్రీ మోదీ అన్నారు. "ఇవాళ, ద్రవ్యోల్బణం రేట్లు సుమారు 2 శాతం వద్దే తిరుగాడుతున్నాయి. పౌరులు ఊరట చెందుతున్నారు.. జీవన సౌలభ్యం మెరుగైంది. తక్కువ ద్రవ్యోల్బణానికి అధిక వృద్ధి తోడు కావడం బలమైన, నిలకడతనంతో కూడిన అభివృద్ధి బాటలో దేశ పురోగమనాన్ని సూచిస్తోంది" అని శ్రీ మోదీ వివరించారు.

"డిజిటల్ ఇండియా, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వంటి కార్యక్రమాలు భారత్‌లో అందివస్తున్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్తున్నాయి. భారత డిజిటల్ అనుబంధ విస్తారిత వ్యవస్థ పట్ల ప్రపంచ దేశాల్లో గుర్తింపు, ఆసక్తి అంతకంతకు పెరుగుతున్నాయి" అని ప్రధానమంత్రి అన్నారు. ఫిన్‌టెక్ రంగంలో యూపీఐ బలమైన ఉనికిని ఏర్పరుచుకొందని ఆయన వ్యాఖ్యానించారు. రియల్-టైం లావాదేవీల్లో ప్రపంచ దేశాలన్నిటి కంటే ఎక్కువగా నమోదు చేస్తూ భారత్ అగ్రగామిగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఇటీవల అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్న ఒక ప్రపంచ స్థాయి శిఖరాగ్ర సదస్సులో భారత్ ప్రధాన విజయాలను సాధించడాన్ని గురించి శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ)ను ఉదాహరించారు. ఇండియాలో 90 కోట్ల మందికి పైగా పౌరులకు సామాజిక భద్రత లభిస్తోందని, సామాజిక సంక్షేమం పరంగా చూస్తే ఇది ఒక ప్రధాన విజయమని ఐఎల్ఓ పేర్కొందని ఆయన తెలిపారు. వానాకాలంలో సాధారణంగా వ్యాపించే కంటి వ్యాధి 'ట్రాకోమా' ఆనవాళ్లు భారత్‌లో మచ్చుకైనా లేవని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పేర్కొన్న సంగతిని కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ గుర్తింపు భారత్ ప్రజారోగ్యసంరక్షణ కృషిలో ఒక చెప్పుకోదగ్గ ముఖ్య ఘట్టమని ఆయన స్పష్టం చేశారు.

పహల్‌గామ్‌లో క్రూర హత్యలు ప్రపంచాన్నిగ్భ్రాంతికి గురిచేయడమే కాక, ఉగ్రవాదం పట్ల ఉగ్రవాదానికి కొమ్ముకాస్తున్న శక్తుల పట్ల ప్రపంచం దృష్టిని సారించేలా చేశాయని ప్రధానమంత్రి గుర్తు చేశారు. ఈ హత్యాకాండకు ప్రతిస్పందనగా చాలావరకు రాజకీయ పక్షాల ప్రతినిధులు, రాష్ట్రాలు పక్షపాత ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరించి దేశ ప్రజల సేవను మిన్నగా భావిస్తూ అంతర్జాతీయ ప్రచారానికి కదం తొక్కినట్లు ఆయన వివరించారు. ఈ సమైక్య దౌత్య ప్రచారోద్యమం పాకిస్తానును ఉగ్రవాద మద్దతుదారు దేశంగా ప్రపంచ రంగస్థలంపై నిలబెట్టి, సఫలమైందని ఆయన ప్రధానంగా చెప్పారు. ఈ కీలక జాతీయ కార్యక్రమానికి తోడ్పాటును అందించిన రాజకీయపక్షాలను, ఎంపీలను శ్రీ మోదీ మనస్ఫూర్తిగా అభినందించారు. వారి ప్రయత్నాలు దేశంలో ఒక సానుకూల వాతావరణాన్ని నెలకొల్పడమే కాకుండా ఉగ్రవాదం విషయంలో భారత్ దృక్పథాన్ని అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకొనేటట్లు చేశాయని ఆయన అన్నారు. దేశ హితం కోరి ఈ ముఖ్య సేవలో పాలుపంచుకొన్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించడం తనకు దక్కిన అదృష్టంగా తాను భావిస్తున్నానని ఆయన తెలిపారు.

ఐకమత్యానికి ఉన్న శక్తి, ఒకే స్వరాన్ని వినిపించే భావన .. ఇవి దేశ ప్రజలకు స్ఫూర్తిని పంచుతాయి, వారిని ఉత్తేజితులను చేస్తాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ భావనలనే ప్రస్తుత వర్షాకాల సమావేశాలు కూడా ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు. ఈ క్రమంలో విజయోత్సవ స్ఫూర్తికి ఈ సమావేశాలు అద్దం పడతాయని, భారత సైనిక శక్తి, దేశ సామర్థ్యాలను గౌరవిస్తూ, 140 కోట్ల మంది పౌరులకు ప్రేరణనివ్వగలవని కూడా ప్రధానమంత్రి చెప్పారు. మన అందరి ప్రయత్నాలు రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధనకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను బలపరచగలవని శ్రీ మోదీ అన్నారు. సాయుధ దళాల బలాన్ని దేశం గుర్తించి, ప్రశంసించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ పక్షాలతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఐకమత్యం నుంచి, ఒకే వాణిగా వినిపించే మాట నుంచి వెలువడే ప్రభావం చాలా బలంగా ఉంటుందని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ భావనను పార్లమెంటులో వ్యక్తపరచండంటూ ఎంపీలందరికీ ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ పక్షాలకు వేటికి వాటికి వాటి వాటి ఎజెండాలంటూ ఉంటాయని శ్రీ మోదీ అంగీకరిస్తూ, అభిప్రాయాలు అనేవి పార్టీ ప్రయోజనాల పరంగా భిన్నమైనవే అవ్వొచ్చుగాక.. దేశ హితంతో ముడిపడ్డ విషయాలలో పొందికతో కూడిన సంకల్పం ఉండితీరాలని స్పష్టం చేశారు. ఆయన తన ప్రసంగం చివర్లో, ఈ పార్లమెంట్ సమావేశాలు దేశాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో ప్రతిపాదిస్తున్న అనేక బిల్లులకు వేదిక అవుతాయని, ఈ సమావేశాలు పౌరులకు సాధికారతను కల్పిస్తూ, దేశ ప్రగతిని బలపరుస్తాయని పునరుద్ఘాటించారు. ఫలప్రదం కాగల, అధిక నాణ్యతతో కూడిన చర్చలో పాల్గొనాల్సిందిగా ఆశిస్తూ పార్లమెట్ సభ్యులకు ఆయన తన శుభాకాంక్షలు తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకం .

## - కలెక్టర్లతో వీ.సీలో మంత్రులు స్పష్టీకరణ.



సంగారెడ్డి జూలై 22(నేటి నిజం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పథకాల అమలు పురోగతిని సమీక్షించారు . సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ పి ప్రావీణ్య వీ.సీలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహాలలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై మంత్రులు సమీక్షిస్తూ, కలెక్టర్లకు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో వాటి అమలులో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్ల నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, వారంలో ఒకరోజు అధికారులు హాస్టళ్లలో బస చేయాలని ఆదేశించారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించేలా చూడాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని అన్నారు.

హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్ల కు నిర్వాహణ తీరును పర్యవేక్షించడంపై పలు సూచనలు చేశారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రగతిని మంత్రులు సమీక్షిస్తూ, ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారునికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని అన్నారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమోదైన దరఖాసులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , డీఆర్డీఓ జ్యోతి , గృహనిర్మాణ శాఖ పి డి చలపతిరావు ,జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి ,పౌర సరఫరాల శాఖా జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిసిలను రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయి - ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జులై 22: బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో నేడు ఆమె మీడియాతో మాట్లాడుతూ, బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు. ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు.

పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు.

# సమస్యలను పరిష్కరించండి.. ఆర్ బీ చైర్మన్ కు ఎంపీ కేశినేని విజ్ఞప్తి



అమరావతి, జులై 22:విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన నిధులను రైల్వే శాఖ ద్వారా త్వరితగతిన విడుదల చేయించాలని రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్ కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్ ను రైల్ భవన్ లోని ఆయన కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ ఇవాళ కలిసి విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్ తో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తావించారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో పెండింగ్ లో వున్న లెవెల్ క్రాసింగ్ నెం.316 (విజయవాడ - గుణదల), లెవెల్ క్రాసింగ్ నెం. 147 (రాయనపాడు కొండపల్లి), లెవెల్ క్రాసింగ్ నెం.148 (విజయవాడ -రాయనపాడు), లెవెల్ క్రాసింగ్ నెం.8 (విజయవాడ -రామవరప్పాడు), వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ ఓ బీ), రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్ యూ బి ఎస్) నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అలాగే అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన రూ.836.47 కోట్ల నిధులను రైల్వే శాఖ తొందరగా విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన విజ్ఞప్తులపై రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్ సానుకూలంగా స్పందించటమే కాకుండా వెంటనే సంబంధిత అధికారులకు స్వయంగా ఫోన్ చేసి తగిన ఆదేశాలు జారీ చేశారు.

# గిరిజనుడిపై పులి దాడి.. భయాందోళనలో గూడెం ప్రజలు..

నంద్యాల, జులై 22:నంద్యాల జిల్లాలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో ఉన్న చెంచు యువకుడిపై పెద్దపులి దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది.

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సదరం పెంట చెంచు గూడానికి చెందిన పులిచెర్ల అంకన్నపై పెద్దపులి దాడి చేయటం తీవ్ర కలకలం రేపింది. అంకన్న కు తీవ్ర గాయాలయ్యాయి. అంకన్న శరీరంపై పలు చోట్ల దాడి చేసింది. శరీరంపైన కాలిపైన, చేతుల పైన, దాడి చేసింది. గూడెం శివారులో బహిర్భూమికి వెళ్ళిన చెంచు యువకుడిపై పులి దాడి చేయటంతో గ్రామస్తులందరూ ఒక్కసారిగా కర్రలు పట్టుకుని కేకలు వేసుకుంటూ బయటికి రావటంతో ఆ పులి అడవిలోకి పారిపోయింది.

గూడెంవాసులు కేకలు వేయడంతో పులి యువకుడిని వదిలి అడవిలోకి వెళ్ళింది. పులి దాడిలో ప్రాణాలతో బయటపడ్డ గిరిజనుడు అంకన్నను మెరుగైన వైద్య సేవల కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్సను ఇప్పిస్తున్నారు. భయాందోళనకు గురవుతున్న నల్లమల్ల చెంచు గిరిజన గూడెం ప్రజలు, అటవీ శాఖ అధికారులు ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నారు.


శ్రీ వాణి సాహిత్య పరిషత్తు
పెందోట బాల సాహిత్య పీఠం (రి.నెం. 324/16)
సిద్దిపేట.

చెప్పితే సగం ఇవ్వాలి, శ్రీ శుభమస్తు
పుస్తకాల ఆవిష్కరణ
మరియు
కవి సమ్మేళన
ఆహ్వానము

తేది. 25-7-2025 శుక్రవారం రోజున సా॥ 5 గంటలకు
వేదిక. ప్రతిభ డిగ్రీ కాలేజి, మెదక్ రోడ్, సిద్దిపేట.
సభాధ్యక్షులు: పెందోట వెంకటేశ్వర్లు గారు
శ్రీవాణి అధ్యక్షులు
ముఖ్య అతిథి: శ్రీ ఎర్రోజు వెంకటేశ్వర్లు గారు
ప్రముఖ సాహితీవేత్త, కవి, కరీంనగర్.
ఆత్మీయ అతిథులు
శ్రీ డి. సూర్య ప్రకాశ్‌గారు — ప్రతిభ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్
శ్రీ యం.ఎ. బాసిత్ గారు — కవి, G.H.M. ZPHS దొమ్మాట
శ్రీ బైతి దుర్గయ్యగారు — అక్షర సేద్యం పౌండేషన్ అధ్యక్షులు
శ్రీ సుందరకాండ సత్యనారాయణగారు — సుందరకాండ గాయకుడు
పుస్తక సమీక్షకులు
శ్రీ మిట్టపల్లి పరశురాములు గారు — కవి
శ్రీమతి జి. సత్యలక్ష్మి గారు — తెలుగు భాషోపాధ్యాయురాలు

పుస్తక ఆవిష్కరణ, కవిసమ్మేళనములను జయప్రదం చేయగలరని సాహితీ మిత్రులను, కవులను, రచయితలను కోరుతున్నాం.

ఆహ్వానించువారు
శ్రీవాణి సాహిత్య పరిషత్తు

## జిల్లాల పేర్ల మార్పుపై ఏపీ ప్రభుత్వం చర్యలు.. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

అమరావతి, జులై 22: ఏపీలోని జిల్లాల పేర్ల మార్పులు చేర్పుల కోసం కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్ల మార్పులు చేర్పులకు సంబంధించి అధ్యయనం చేసేందుకు ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మంత్రివర్గ ఉపసంఘంలో ఏడుగురు మంత్రులు సభ్యులుగా ఉండనున్నారని ఉత్తర్వుల్లో పేర్కొంది. అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ మంత్రివర్గ ఉపసంఘంలో ఉండనున్నారు. దీనికి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారని తెలిపింది. జిల్లా రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘానికి ఏపీ ప్రభుత్వం సూచించింది.

సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతం, చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం అంతరాలు లేని విధంగా ప్రాంతాలను నిర్దేశించాలని, జనాభా సంఖ్య, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సరిహద్దులు నిర్ణయించాలని తెలిపింది. సరిహద్దులు, పేర్లపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

## జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన ఈవో శ్రీనివాసరావు



శ్రీశైలం జులై 22 : శ్రీశైల జలాశయానికి అనుబంధంగా ఉండే ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రం దేశంలోనే ప్రత్యేక స్థానం ఉందని మల్లికార్జునస్వామి ఆలయ ఈవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం క్రస్ట్ గేటును తెరిచిన అనంతరం భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని చీఫ్ ఇంజినీయర్ కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో యానిట్లతో పాటు నాలుగు అంతస్థులను ఆయన సందర్శించారు. యూనిట్ల పనితీరుతోపాటు అధునిక సాంకేతిక సర్దుబాట్లను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిరంతర విద్యుత్ ఉత్పత్తి కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

## హోంగార్డుల జీతాల జాప్యం పై హరీష్ రావు ఆగ్రహం..

### -కాంగ్రెస్ పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి

హైదరాబాద్, జులై 22:తెలంగాణలో హోంగార్డులకు జీతాలు జాప్యం కావడంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 16,000 మందికి పైగా హోంగార్డులు వేతనాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు.

తక్షణ జీతాల విడుదలకు డిమాండ్

హోంగార్డులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి నెలా జీతాలు సమయానికి అందేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతి నెలా జీతాలు ఆలస్యమవుతున్నాయని, హోంగార్డులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు లేకపోవడం వల్ల ఇంటి అద్దె, పిల్లల చదువు ఖర్చులు, బ్యాంకు రుణాలు అన్నీ తీర్చలేక పోతున్నారని, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకుల నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నానని వివరించారు.

హోం శాఖ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలో ఉన్నా ఆయన ఈ సమస్యపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని హరీష్ రావు నిలదీశారు. "మాటల్లో కోటలు దాటే సీఎం.. చేతల్లో మాత్రం పని కనిపించటం లేదు," అంటూ ఎద్దేవా చేశారు.

హోంగార్డుల జీతాలు ఇవ్వకుండా, పథకాలకూ కోతలు పెట్టి ప్రభుత్వం ప్రజావ్యతిరేకంగా పనిచేస్తోందని హరీష్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాల వల్ల వేతన జీవులు ఇబ్బందులు పడుతుంటే సీఎం మాత్రం నిశ్శబ్ధంగా ఉంటున్నారని విమర్శించారు.

## కెటిఆర్ గిఫ్ట్ ఎ స్మైల్ .. కెసిఆర్ కిట్ల పంపిణి



హైదరాబాద్, జులై 22:మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న ఉక్రోశంతోనే రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని తెలిపారు.

తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ కిట్లను ఇస్తానని ప్రకటించిన కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తల్లీబిడ్డలకు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా గత 20 నెలల నుంచి కేసీఆర్ కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే తన పుట్టిన రోజు సందర్భంగా 5 వేల మంది తల్లులకు సిరిసిల్లలో కేసీఆర్ కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. 2014 కు ముందు నేను రాను బిడ్డో సర్కారు దవఖానాకు అని జనాలు భయపడేవారన్న కేటీఆర్.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న చర్యలతో సర్కార్ దవాఖానాకే పోవాలని జనాలంతా అనుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చిన కేసీఆర్ కిట్లను గత 20 నెలల నుంచి రేవంత్ సర్కార్ ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్ మీద ఉన్న అంతులేని ద్వేషం, కోపమే ఇందుకు కారణమని విమర్శించారు.

గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పేద ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం అందించేందుకు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ సెల్‌కు చెందిన సంతోశ్ రోకండ్ల ముందుకొచ్చి.. రూ.1,40,000 లు అందజేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదువుతున్న పేద ఎంబీబీఎస్ విద్యార్థి సింహాద్రి చదువు కోసం ఆర్థిక సాయం అందించాలని ఇటీవల కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేటీఆర్ పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ స్ఫూర్తితో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ సెల్‌కు చెందిన సంతోశ్ రోకండ్ల ముందుకొచ్చారు. ఇవాళ సంతోశ్ కుటుంబసభ్యులైన రోకండ్ల జ్యోతి ఇవాళ కేటీఆర్‌ను కలిసి, ఆయన చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థి సింహాద్రికి రూ.1,40,000లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంతోశ్‌ను కేటీఆర్ అభినందించారు.

## వాట్సప్ చాటింగ్ వివాదం.. వ్యక్తి దారుణ హత్య

సూర్యాపేట, జులై 22:పద్మశాలి కుల సంఘం ఎన్నికలపై వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్‌కు స్పందించిన వివాదం ఒక వ్యక్తి దారుణ హత్యకు దారి తీసింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణానికి చెందిన మానుపురి కృపాకర్ (48) చెప్పుల వ్యాపారం నిర్వహిస్తుంటారు. వచ్చే నెల 3 తేదీన నిర్వహించ నున్న పద్మశాలి కుల సంఘ ఎన్నికలకు సంబంధించి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్ తన కుల సంఘానికి సంబంధించి వాట్సప్ గ్రూపులో ఓ మెసేజ్ పెట్టగా దానికి కృపాకర్ క్లాప్స్ కొడుతూ ఎమోజి పెట్టారు.

## అన్ని పోలింగ్ కేంద్రాల్లో 1200 కంటే తక్కువ మంది ఓటర్లున్న మొదటి రాష్ట్రంగా నిలిచిన బీహార్..

న్యూఢిల్లీ, జులై 22:1,200 కంటే తక్కువ మంది ఓటర్లతో అన్ని పోలింగ్ కేంద్రాలు (పీఎస్) కలిగిన ఉన్న మొదటి రాష్ట్రంగా బీహార్ నిలిచింది. పోలింగ్ స్టేషన్ల వద్ద పొడవైన వరుసలను నివారించేందుకు ఆ రాష్ట్రంలో కొత్తగా 12,817 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి గరిష్ఠంగా 1500 మంది ఓటర్లు మాత్రమే ఉండాలన్న క్రితం నిబంధనను మారుస్తూ 2025 జూన్ 24 న ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం (బీహార్ ఎస్ఐఆర్ ఆర్డర్‌లోని పేజీ2లో పాయింట్ 6/7, పేజీ7 లో పాయింట్ 2(ఏ)) ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1200 మంది ఓటర్లే ఉండాలి. రాష్ట్రంలో కొత్తగా 12,817 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన తర్వాత మొత్తం పీఎస్‌ల సంఖ్య 77,895 నుంచి 90,712కి పెరిగింది. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు కూడా బీహార్ బాటన నడవనున్నాయి.

అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈఓ, డీఈఓ, ఈఆర్ఓ, బీఎల్ఓలు సమావేశాలు నిర్వహించి.. ఇప్పటివరకు ఫారాలు అందని 29.62 లక్షల మంది ఓటర్ల వివరాలను, ఇచ్చిన చిరునామాలలో అందుబాటులో లేని దాదాపు 43.93 లక్షల మంది ఓటర్ల జాబితాను వారికి అందించారు.

12 ప్రధాన రాజకీయ పార్టీలన్నీ కూడా సంబంధిత జిల్లాల అధ్యక్షులు, ఆయా పార్టీలకు చెందిన సుమారు 1.5 లక్షల మంది బీఎల్ఓల ద్వారా ఓటర్లను చేరుకోవాలని అధికారులు కోరారు. 2025 ఆగస్టు 1న ప్రచురితం కానున్న ముసాయిదా ఓటరు జాబితాలో అర్హత కలిగిన అందరూ ఉండేలా రాజకీయ పార్టీలతో సహా మొత్తం ఎన్నికల యంత్రాంగం ఒక మిషన్ తరహాలో కలిసి పనిచేసేందుకు ఈసీఐ ఈ చర్యలు తీసుకుంటోంది.

## టిటిడికి కొత్త పరిపాలన భవనం.. సామాన్య భక్తులకు మరిన్ని వసతి గృహాలు - పాలకమండలి



తిరుపతి, జులై 22: తిరుమలలో పరిపాలన భవనాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు టిటిడి పాలకమండలి సభ్యులు . పాత భవనాలని తొలగించి వాటి స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టాలనే ప్రతిపాదనను బోర్డు ఆమోదించింది.. తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి నేడు సమావేశమైంది. ఈ సమావేశంలో టీటీడీ పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -3 నిర్మాణంపై చర్చించామని కమిటీ నివేదిక మేరకు ఈ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సామాన్య భక్తులకు అదనంగా వసతి సదుపాయలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అలిపిరి వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ఓ కమిటీని నియమించనున్నట్లు ప్రకటించారు.

ఒంటిమిట్ట ఆలయంలో త్వరలోనే అన్నదానం ప్రారంభించనున్నారు. రూ. 4.7 కోట్లతో అన్నదానం కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు టీటీడీ పాలక మండలి సభ్యులు. 320 ఆలయాలకు మైక్ సెట్లు ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 700 మంది వేద పారాయణదారుల నియామకానికి ఆమోదం తెలిపారు. ఇందుకోసం రూ.18కోట్ల నిధులు కేటాయించనున్నారు. 600 మంది వేద పారాయణదారులకు నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఆమోదించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఏపీలోని పలు దేవాలయాల వద్ద భజన మండలాల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు.

శిలాతోరణం, చక్రతీర్థం అభివృద్ధి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణ అధ్యాయనానికి ఓ కమిటీ వేయనున్నట్లు వివరించారు. శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసే విధంగా కో ఆర్డినేటర్ల నియామకానికి ఆమోదం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదించారు. కల్యాణకట్టల వద్ద పారిశుధ్యం పెంపునకు కూడా ఆమోద ముద్ర వేశారు.

### టీటీడీ పాలకమండలి నిర్ణయాలు

టీటీడీలోని 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను రెగ్యూలైజ్ చేసి, ప్రభుత్వ ఆమోదానికి పంపాలని బోర్డు కీలక నిర్ణయం

తిరుమలలో 3వ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిర్మించాల్సిన ఆవశ్యకత పై కన్సల్టెన్సీ తో కూడిన కమిటీ ఏర్పాటు

తిరుమలలో భక్తుల వేచిఉండేందుకు అనువైన నిర్మాణాలు ఎలా చేయాలనే దానిపై కన్సల్టెన్సీ నియాకం

అలిపిరి వద్ద ఆధ్యాత్మిక భావన మరింత పెంపొందించేలా, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన అభివృద్ధి పై కన్సల్టెన్సీ నియామకం

టీటీడీలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను నివారించేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం

తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా పరిపాలన భవనం నిర్మించాలని నిర్ణయం ..

ఒంటిమిట్ట కోదండరామాలయంలో పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు రూ 4.35 కోట్లు నిధులు మంజూరు

ఆగష్టు నెల నుండి మూడుపూట్ల ఒంటిమిట్టలో భక్తులకు అన్నప్రసాద వితరణ

700 మంది వేదపారాయణదారులు నూతగ ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయం

దేవాదాయ శాఖ సిఫార్సు ప్రకారం 600 మంది వేదపారాయదారులకు నిరుద్యోగభృతి క్రింద నెలకు రూ 3 వేలు అందించాలని నిర్ణయం

ఎస్సీ,ఎస్టీ, వెనుకబడిన ప్రాంతాల్లో మూడు కేటగిరీల్లో భజనమందిరాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు విడుదల

కడపలో వేల సంవత్సరాల చరిత్ర గల శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరు

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కామెంట్స్

ఏఐ టెక్నాలజీ అమలుకు విధానపరంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి?.సమస్యలు అధిగమించడంపై రెండు ప్రముఖ సంస్థలు కసరత్తు చేస్తున్నాయి.త్వరలో ఏఐ అమలు చేసి భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తాంహిందూయేతర ఉద్యోగులపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది?అన్యమత ఉద్యోగుల పై నిఘా పెట్టాం, ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదుటీటీడీ నియమ నిబంధనలు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం

## గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి : రమేశ్‌నాయక్

హైదరాబాద్, జులై 22:: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు రమావత్ రమేశ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం దేవరకొండ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని వసతులు అందుబాటులో తీసుకొచ్చినట్లు చెప్పారు.

## పోలీసులు క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలి : సీపీ అంబర్ కిశోర్ ఝా

కరీంనగర్, జులై 22: పోలీసులు తమ విధులను క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పోత్కాపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని సిబ్బందిని ఆదేశించారు. పారదర్శకంగా పోలీసింగ్ ఉండాలి అని ప్రజలకు పోలీసు సేవలను వేగంగా అందించాలని సిబ్బందికి తెలిపారు.

## కొత్తగూడెం అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం,జూలై 22 : ప్రతీ క్షణం కొత్తగూడెం ప్రాంతాభివృద్ధి కోసమే కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి సంబురాలు' కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ప్రమాద బీమా, బ్యాంక్ లింకేజీ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయమని సీఎం రేవంత్ రెడ్డిని అడుగుతున్నట్లు, హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాజీపడబోనని తెలిపార. ప్రతీ మహిళకు సంక్షేమం, ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అమలు చేసే పథకం అందేలాగా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, అదనపు డీఆర్డీఓ నీలేశ్, మెప్మా డీఎంసీ రాజేశ్, ఏడీఎంసీ చంద్రశేఖర్, సెర్ప్ ఏపీఎంలు, ఓబీలు, గ్రామ దీపికలు, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## నాలాల అభివృద్ధికి నిధులను వినియోగించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



హైదరాబాద్, జులై 22:నాలాల అభివృద్ధికి కంటోన్మెంట్ బోర్డుకు జమైన పరిహారపు నిధులను వినియోగించాలని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ కు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సూచించారు. ఈ మేరకు మంగళవారం బోర్డు కార్యాలయంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ను బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్ తో కలిసి ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డుకు సమకూరిన రూ. 303 కోట్లతో నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

## ఇకపై అన్ని సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్

హైదరాబాద్, జులై 22: మందుబాబులూ .. బీ కేర్ ఫుల్.. ఇకపై ఎనీ టైమ్ ఎనీ సెంటర్ తనిఖీలు తప్పవు. వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. పాఠశాలలకు పిల్లలను తీసుకెళ్లే బస్సు, వ్యాను, ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు ట్రాఫిక్ తనిఖీల్లో గుర్తించారు. దీంతో పగటిపూట కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసులు డిసైడయ్యారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేసే క్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో నెలరోజుల్లో 35 మంది డ్రైవర్లను గుర్తించారు.

ఇందులో ఓ డ్రైవర్‌కు 400 రీడింగ్ వచ్చింది. ఈ విషయాన్ని జోయల్ డేవిస్ సిటీ పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఎనీటైం తనిఖీలకు నిర్ణయం తీసుకున్నారు. వారంరోజులుగా నగరంలోని పలు ప్రాంతాల్లో అన్ని సమయాల్లో తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు రవాణా శాఖతో పాటు విద్యాశాఖకు కూడా పోలీసులు లేఖ రాశారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు తాగి నడపడం వల్ల పిల్లలు ప్రమాదంలో ఉంటున్నారని, పాఠశాలల్లో డ్రైవర్లను ఉదయం, సాయంత్రం తనిఖీలు చేసి పంపాలని పేర్కొన్నారు.

వాహనదారులు, రాత్రివేళల్లో మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ ఉంటుందనుకుంటున్నారు కానీ.. ఇప్పుడు ప్రత్యేక తనిఖీలతో మందుబాబుల భరతం పడుతున్నారు. టెస్టులో 30 ఎంజీ కంటే ఎక్కువ ఉంటే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో మొత్తం 30వేల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టగా, ఇందులో 1300 మందికి ఒక రోజు నుంచి ఇరవై రోజుల వరకు జైలుశిక్ష పడింది. మరో 4500 కేసుల్లో 2800 వరకు రిజిస్ట్రేషన్ల రద్దు కోసం పంపిస్తే అందులో 853 రద్దయ్యాయి. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే వాహనాలను ప్రధానంగా టార్గెట్ చేసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నామని చెబుతున్న పోలీసులు ఆ దిశగా ఉదయం, సాయంత్రం వేళల్లో తనిఖీలు ముమ్మురం చేశారు. గత వారం మింట్ కాంపౌండ్ జంక్షన్‌లో, ఖైరతాబాద్ జంక్షన్‌లో సోమవారం ట్రాఫిక్ డీసీపీ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

పగటిపూట కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మంచివే అయినప్పటికీ పోలీసులు చెప్పినట్లు రద్దీ లేని మార్గాల్లో కాకుండా ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జరపడం వల్ల సాధారణ ప్రజలు కొంత ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. అయితే రద్దీ లేని ప్రాంతాల్లోనే ఈ తనిఖీలు జరుగుతాయని ట్రాఫిక్ ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ మొదటి రెండు రోజుల తర్వాత నుంచి కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలు రద్దీ మార్గాల్లో జరుగుతుండడంతో సాధారణ వాహనదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొనక తప్పడం లేదు. తనిఖీలు చేయాలని, కానీ ఆఫీస్ టైమింగ్స్, ఎమర్జెన్సీగా వెళ్లే సమయంలో ఇలా తనిఖీలు చేపట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, పోలీసులు ఆ దిశగా ఆలోచించి రద్దీలేని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి దొరికితే కఠిన చర్యలు తప్పవని నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ హెచ్చరించారు.

## ఆస్ట్రేలియాలో ఘనంగా బోనాల జాతర

హైదరాబాద్, జులై 22: ఆస్ట్రేలియాలో బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గత పన్నెండు సంవత్సరాలుగా మెల్‌బోర్న్ నగరంలో రాక్బ్యాంక్ దుర్గ మాత టెంపుల్‌లో మెల్‌బోర్న్ బోనాలు సంస్థ ఆధ్వర్యంలో బోనాల జాతర ఘనంగా జరిపారు. తెలంగాణ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి బోనాలు, తొట్టెల సమర్పించుకుని తమ మొక్కును చెల్లించుకున్నారు. పోతురాజుల ఆట, పాటలు, యువకుల నృత్యాలతో దుర్గా మాత ఆలయంలో ఎంతో సందడి చేసారు.

## ఆగష్టు 15 నుంచి ఏపి లో ఉచిత బస్సు సౌకర్యం: మంత్రి నారాయణ

అమరావతి జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ..ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని మంత్రి నారాయణ తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం అని అన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఎపి మండిపడ్డారు. కృష్ణా జిల్లా పెడనలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను మంత్రి వివరించారు. పెడనలో డ్రైనేజీల నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ పూర్తికి రేపు నిధుల విడుదలకు హామీ ఇచ్చారు. పెడనలో వచ్చే రెండేళ్లలో తాగునీరు అందించేలా పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.


భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం
సౌజన్యంతో
అమరవాది ఫౌండేషన్
సాహిత్య, సాంస్కృతిక, బాల వికాస సంస్థ, హైదరాబాద్
శ్రీమతి అమరవాది హైమవతీ-డా. ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీమతి శీలా సుభద్రాదేవి
డా. ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : డా. అమ్మిన శ్రీనివాస రాజు
డా. అమరవాది నీరజ అంజు బాలల బొమ్మల కథా పుస్తకం
డా. పత్తిపాక మోహన్ తెలుగు బాల గీతాల హిందీ అనువాదం హరే బరే గీత్ అను: డా. షేక్ అబ్దుల్ ఘనీ
శ్రీ గరిపెల్లి అశోక్ గోటీలాట బాలల కథా సంపుటి
పుస్తకాల ఆవిష్కరణ - బాలల కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం
27 జూన్, 2025 ఆదివారం, మధ్యాహ్నం గం. 2.30 నుండి 4.30 వరకు
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్
సభాధ్యక్షులు
డా. పత్తిపాక మోహన్
దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, విద్యా మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం
ముఖ్య అతిథి
ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
పూర్వాధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం & అఖిల భారత, జా.సా.ప.
జ్యోతి ప్రకాశనం
శ్రీమతి మాడభూషి లలితా దేవి
అధ్యక్షులు, డా. మాడభూషి రంగాచార్య స్మారక సమితి
అమరవాది ఫౌండేషన్ పక్షాన
డా. అమరవాది నీరజ అధ్యక్షులు | ఎ. సీతారాం ఉపాధ్యక్షులు | చింతకింది మాల్య్వ ప్రధాన కార్యదర్శి | డా. హారిక చెరుకుపల్లి నిర్వాహక కార్యదర్శి

# స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలి

## -బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు పార్టీ ఆదేశం

హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు నిర్ణయించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ నిర్వహించే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసి ద్ధం చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు పార్టీ నేతలను ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈ సమావేశాలు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో పార్టీ ఎంఎల్ఎలు, ఎంఎల్సిలు, ఎంపిలు, జెడ్పి చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలని అన్నారు.తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీను అమలుచేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో పాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని కెటిఆర్ దిశానిర్దేశం చేశారు. రైతుబంధు ఇవ్వకుండా అన్నదాతలకు రేవంత్ సర్కార్ చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా వేధిస్తున్నా కూడా ఈ ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనాన్ని తెలియచేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల నుంచి సాగునీటి నుంచి విద్యుత్ సరాఫరా దాకా అన్నదాతలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని చెప్పాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

ప్రభుత్వ చేతకానితనంతో పాలన అస్తవ్యస్తంగా మారి గ్రా మాల్లో పారిశుద్ధ్యం పడకేసిందన్న సంగతిని ప్రజలకు చెపా ?పలని కెటిఆర్ పార్టీ నేతలకు చెప్పారు. బిసిలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ పేరుతో ఆడుతున్న డ్రామాలను ప్రజలకు విడమిరిచి చెప్పాలని పేర్కొన్నారు. అంతేకాకుండా వివిధ రంగాలకు డిక్లరేషన్‌ల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆయా రంగాలను మోసం చేసిన తీరును వివరించాలని అన్నారు. వృద్ధులకు పెంచుతానన్న రూ.4 వేల పెన్షన్‌తో పాటు ఆడబిడ్డలకు నెలకు ఇస్తానన్న 2500 రూపాయలతో పాటు ఇతర హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న ద్రోహాలను విడమరిచి చెప్పాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల తరఫున గత 20 నెలల కాలం నుంచి కాంగ్రెస్‌పార్టీ పైన బిఆర్ఎస్ చేస్తున్న ప్రజా పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఈ వారంలోనే ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు జరిగేలా చూడాలని కెటిఆర్ తెలిపారు.

# పెండింగ్ లో ఉన్న మెస్ బకాయిలు, స్కాలర్షిప్స్ విడుదల చేయాలి: ఏబివిపి డిమాండ్




హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పెండింగ్ లో ఉన్న మెస్ బకాయిలు, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని ఏబివిపి డిమాండ్ చేసింది. ఏబివిపి సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆధ్వర్యములో పెండింగ్ లో ఉన్న మెస్ బకాయిలు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన మీడియా సమావేశానికి ఏబివిపి తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 8300 కోట్ల స్కాలర్షిప్స్ మరియు సికింద్రాబాద్ పీజీ కళాశాల కు రావాల్సిన 9 కోట్ల మేస్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా సికింద్రాబాద్ పీజీ కళాశాల లో చదువుకొనే పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన డిగ్రీ మరియు పీజీ విద్యార్థులు, స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేకపోవడం నిజంగా బాధాకరం. పేరుకేమో ప్రభుత్వ కళాశాల కానీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ మరియు మెస్ బకాయిలు రాక వాళ్ల చేతుల్లో నుండి డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి .విద్యార్థులకు స్కాలర్షిప్ అనేది ప్రభుత్వ బిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. రాష్ట్రంలోని వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు స్కాలర్షిప్ లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం తో విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. స్కాలర్షిప్ అందని కారణంగా విద్యార్థులు ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్లు (౧అలు), మెమోలు తీసుకోలేక, వారి పై చదువులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల వద్ద కొన్ని కార్పొరేట్ కళాశాలలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పరిస్థితిని అరికట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను మరియు మెస్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలు రాజు, సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, హైదరాబాద్ మహానగర ౹ఈఆ కన్వీనర్ పాండురంగ్, బేగంపేట్ టౌన్ సెక్రటరీ పవన్ చౌహాన్, బేగంపేట్ జాయింట్ సెక్రెటరీ కృష్ణ, విద్యార్థి నాయకులు దుర్గేష్, భాను, రామ్, అపర్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వెనుక బీజేపీ కుట్ర: ఆర్జేడి

## – నితీష్ కుమార్ బిహార్‌ను విడిచిపెట్టే ప్రసక్తే లేదు: జేడీయూ

పాట్నా జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వెనుక బీజేపీ కుట్ర ఉందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడి ) సంచలన ఆరోపణ చేసింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే నితీష్ కుమార్ ను మార్చేందుకే ఇలా చేసినట్టు అసెంబ్లీలో ఆర్జేడీ చీఫ్ విప్ అఖ్తరుల్ ఇస్లామ్ షహీన్ అన్నారు. మంగళవారంనాడిక్కడ మిడియాతో అఖ్తరుల్ మాట్లాడుతూ, చాలాకాలంగా నితీష్ కుమార్‌కు ఉద్వాసన చెప్పేలా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, ఒక దశలో నితీష్‌ను ఉప ప్రధానిని చేయాలని కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ చౌబే మాట్లాడారని గుర్తు చేశారు. ఈ దశలో జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంలో బీజేపీ కుట్ర కనిపిస్తోందని అన్నారు. ఉపరాష్ట్రపతి వంటి రాజకీయ ప్రాధాన్యత లేని పదవిని ఇచ్చి నితీష్ ను తప్పించాలని బీజేపీ భావిస్తోందని చెప్పారు.కాగా ఆర్జేడీ నేత చేసిన ఆరోపణలను జేడీయూ సీనియర్ నాయకుడు శరవణ్ కుమార్ తోసిపుచ్చారు. నితీష్ కుమార్ బిహార్‌ను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆయన ఇక్కడే ఉంటారని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయానికి సారథ్యం వహిస్తారని, రాష్ట్ర ప్రజలకు మరో ఐదేళ్లు సేవలందిస్తారని చెప్పారు.

# కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠా అరెస్ట్

సూర్యాపేట జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); :సూర్యాపేట జిల్లా మెల్ల చెర్వు మండలం రామాపురం గ్రామంలో ఒక షెడ్ లో కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠాను స్టేట్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సాయం తో అరెస్టు చేసారు?మేళ్లచెరువు మండలం రాంపురం గ్రామానికి చెందిన తోట శివ శంకర్ అను వ్యక్తి సూర్యప్రకాష్ అను వ్యక్తి ఇల్లు మరియు షెడ్ లో సుమారు 832 లీటర్ల స్పిరిట్ ను నిల్వ ఉంచారు?ఖాళీ బాటిల్స్ లో స్పిరిట్ ను నింపి క్యాప్స్ బిగించి నకిలీ లేబుళ్ల ని అతికించి అమ్మే ప్రయత్నం చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేర కు హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సూపరింటెంట్ అంజి రెడ్డి ఆధ్వర్యం లో హుజూర్నగర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది తో కలిసి సంయుక్తం గా దాడులు నిర్వహించారు..ఈ దాడుల లో 832 లీటర్ల స్పిరిట్ తో పాటు 326 లీటర్ల బాటిల్ లో నింపబడిన 38 కాటన్ల ఎఇ విస్కీ బాటిల్స్ ను నకిలి లేబుల్స్ మరియు ఎక్సైజ్ హీల్స్ తో పాటు స్వాధీనం చేసుకున్నారు..

# ఈ విద్యా సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవద్దు..

## – ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎన్ఎంసీ హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : బెలిజ్‌లోని సెంట్రల్ అమెరికా ఈశాన్య తీరంలో ఉన్న వైద్య సంస్థల్లో అలాగే ఉజ్బెకిస్తాన్‌లోని ఒక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేయాలనుకునే విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవద్దని నేషనల్ మెడికల్ కమిషన్ హెచ్చరించింది. బెలిజ్‌లోని సెంట్రల్ అమెరికన్ హెల్త్ అండ్ సైన్సెస్ యూనివర్సిటీ, కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ, వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ అండ్ సైన్సెస్‌తో సహా మూడు వైద్య సంస్థలలో అడ్మిషన్ తీసుకోవద్దని ఎన్ఎంసీ ఒక నోటీసులో భారతీయ విద్యార్థులకు సూచించింది. భారతీయ వైద్య విద్య ప్రమాణాలను పాటించకపోవడం, క్యాంపస్ మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడం, నాణ్యత లేని క్లినికల్ శిక్షణ సౌకర్యాలు, భారతీయ విద్యార్థులపై వేధింపులు వంటి ఆందోళనల నేపథ్యంలో ఎన్ఎంసీ ఈ హెచ్చరికను జారీ చేసింది.

# కాంగ్రెస్ ప్రజాపాలనలో జోడేడ్ల లా పరుగులు పెడుతున్న అభివృద్ధి, సంక్షేమం

## – పిసిసి అధికార ప్రతి నిధి పల్లె రాంచందర్ గౌడ్

హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంది స్తుందని టిపిసిసి అధికార ప్రతి నిధి పల్లె రాంచందర్ గౌడ్ తెలిపారు మంగళవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ సన్న బియ్యం తో దేశంలోనే రికార్డ్ సాధించామని ఆయన పేర్కొన్నారు,రేషన్ కార్డు ల ద్వారా రాష్ట్రం లోని 93లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. పేదలు, ఆర్తి కంగా వెనుక బడిన మధ్య తరగతి వర్గాల అభి వృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పల్లె వివరించారు. 18నెలల ప్రభుత్వ కాలంలో ఓ వైపు అభి వృద్ధి, మరో వైపు సంక్షేమం జోడేడ్ల లా పరుగులు పెడుతుందని అన్నారు. రైతులు పేదల, కంటే తమకు ఏది ముఖ్యం కాదని చెప్పారు.రైతు బందు పతకం ద్వారా పెట్టుబడి సాయం కింద కేవలం 9రోజుల్లో 9వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్రంలో రహదారుల అభి వృద్ధికి విద్యా వైద్యం కోసం పాటు పడుతున్నామని రాంచందర్ గౌడ్ వివరించారు. బీసీ రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కుల గణ న నిర్వహించి న విషయాలు అనేకం ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందుతున్నాయని చెప్పారు త్వరలో జరిగే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ దే విజయమనే దీమాను పల్లె రాంచందర్ గౌడ్ వ్యక్తం చేశారు.


# లోటస్ టెంపుల్‌లో ఉచిత వరలక్ష్మి వ్రతాలు

## – ప్రతి శుక్రవారం కుంకుమార్చన... నాల్గవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం

యాదగిరిగుట్ట,జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రసిద్ధ పుణ్యక్షేత్ర పట్టణమైన యాదగిరిగుట్టలో లోటస్ టెంపుల్ గా పేరుగాంచిన శ్రీ మణి ద్వీపేశ్వరీ విశ్వ జననీ పరాశక్తి పీఠం ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఉచిత సామూహిక కుంకుమార్చనలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు తెలిపారు. ఈ మాసంలో ప్రతి శుక్రవారం సామూహిక కుంకుమార్చన, అదే విధంగా నాల్గవ శుక్రవారం రోజున సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు కుంకుమార్చన, అలాగే నాలుగవ శుక్రవారం రోజున ఉదయం 11 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నారు. ఈ వ్రతాల్లో పాల్గొనదలచిన భక్తులు తమ వెంట అవసరమైన ప్లేట్, కలశం చెంబు ,పూలు ,పండ్లు, తమలపాకులు తెచ్చుకోవాలని కోరారు. ఈ ఆలయంలో నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు .భక్తులు కోరిన కోరికలు నెరవేర్చే అమ్మదయ అపారంగా ఉందని సందర్శకులు తెలుపుతున్నారు. ఈ అవకాశాన్ని భక్తులంతా వినియోగించుకోవాలని అమ్మవారి కృపకు పాత్రులై ధన ధాన్యములు, సౌభాగ్యం పొంది సుఖశాంతులతో వర్ధిల్లాలని ,తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మ కృపకు పాత్రులు కావాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నో జన్మలు ఎత్తిన తర్వాత గాని ఈ మానవ జన్మ సాధ్యం కాదు

## –ఈ జన్మలోనే మోక్ష సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
## –ముఖ్య అతిథి స్వామి తత్పదానందజీ పిలుపు
## –మరో లక్ష విరాళం అందజేసిన విశిష్ట ధర్మకర్త డా॥టి.వి. రమణాకర్



హనుమకొండ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); గురుదేవులు చెప్పినట్లు మానవ జీవిత లక్ష్యం భగవత్ సాక్షాత్కారమేనని ఎన్నో జన్మలు ఎత్తిన తర్వాత గాని ఈ మానవ జన్మ సాధ్యం కాదని ఈ జన్మలోనే మోక్ష సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామిజీ "తత్పదానంద మహారాజ్"పిలుపునిచ్చారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి కేఎల్ఎన్ రెడ్డి కాలనీ హనుమకొండ యందు గురుదేవులు శ్రీరామకృష్ణ పరమహంస భక్తుల "సత్సంగ్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తత్పదానంద మహారాజ్ విచ్చేసి ప్రసంగించారు. జీవితంలో ప్రార్థన అనేది చాలా ముఖ్యమని ప్రతిరోజు ఉదయం లేవగానే కనీసం ఒక నిమిషం పాటైనా భగవంతుని గురించి ప్రార్థన చేయాలని భగవద్గీతలో బోధించినట్లు ఫలితాన్ని భగవంతునికే వదిలివేసి కర్మలు నిర్వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సేవాసమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలలో 2వ శనివారం హనుమకొండ రామకృష్ణ ధ్యాన మందిర్ యందు సత్సంగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

గురుదేవుల ఆశయానికి అనుగుణంగా నెలలో ఒక రోజు ఇంటికి దూరంగా పూర్తిగా సాధు సన్యాసులడ భక్తుల సమక్షంలో సాధన చేయడం జరుగుతుందని తెలిపారు. స్వామిజీ మార్గదర్శనంలో సూచనాత్మక ధ్యానాన్ని నిర్వహించడం జరిగింది శ్రీ శారద మాతృమండలి ఆధ్వర్యంలో సామూహిక "లలిత చాలీసా" మరియు భజనలు చేయడం జరిగింది. రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ గౌరవ ప్రతినిధి సూర్య ప్రకాష్ గారు మాట్లాడుతూ భారత జాతీయ జీవనానికి "ఆధ్యాత్మిక చింతన" మూలమని ఆధ్యాత్మికతను వదిలివేస్తే దేశం తిరిగి బానిసత్వానికి వెళుతుందని, ఆధ్యాత్మికంగా ప్రతి వ్యక్తిని ఉన్నతంగా తయారు చేయడమే రామకృష్ణ సేవా సమితుల ప్రధాన కర్తవ్యమని వివరించారు . ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ కవి, న్యాయవాది ఏరువాక జయశంకర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులలో దేశభక్తి, జాతీయత భావనలను కల్పించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి బృందావన్ అపార్ట్మెంట్ వాస్తవ్యులు మరియు సేవాసమితి విశిష్ట ధర్మకర్త డా? టి.వి. రమణాకర్ గారు భగవాన్ శ్రీరామకృష్ణ ధ్యాన మందిర నిర్మాణానికి మరో లక్ష రూపాయల విరాళం వారి ఉదార ధాతృత్వానికి నిదర్శనం. ఇంకా ఈ కార్యక్రమంలో సేవాసమితి రిటైర్డ్ ప్రొఫెసర్లు డా? రమణమూర్తి, రామన్న, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సౌమిత్రి లక్ష్మణాచార్య, భజన కార్యక్రమ నిర్వాహకులు భాస్కర్, స్వరూప, రాధిక, అంజనీ దేవి, శిల్ప, సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాస స్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, కె వి రావు, తిరుపతిరెడ్డి, లక్ష్మీదేవి, లక్ష్మి రావు, పార్వతి, అరుణ్, విష్ణు, సుమారు 100 మంది భక్తులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా ముఠా అరెస్ట్.. 36 మందికి విముక్తి

నల్గొండ, జులై 22:గత కొంతకాలంగా కృష్ణ నది పరివాహక ప్రాంతంలో చేపల వ్యాపారం కోసం ఇతర ప్రాంతాల నుండి వ్యక్తులను అక్రమ రవాణా చేస్తున్న 8 మందితో కూడిన ముఠాను అరెస్టు చేసి, వెట్టి చేస్తున్న 36 మందికి విముక్తి కల్పించి వారి సొంత ప్రాంతాలకు తరలించి నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. మంగళ వారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ, కార్మిక శాఖ అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మనుషులను అక్రమ రవాణా చేస్తూ, వారితో వెట్టి




చాకిరి చేయిస్తూ ఎలాంటి జీతాలు ఇవ్వకుండా వాళ్లను భయానికి గురి చేస్తూ, పని వేళలు పాటించకుండా, చేపలు పట్టిస్తూ వెట్టి చాకిరి చేయిస్తున్న వ్యక్తుల చెర నుండి 32 మంది కార్మికులు, నలుగురు బాల కార్మికులు మొత్తం 36 మందిని రెస్క్యూ చేసినట్లు చెప్పారు.

పీఏ పల్లి మండలం బనాలకుంట గ్రామానికి చెందిన వద్య జవహర్ లాల్, పాయతండాకు చెందిన రమావత్ రమేశ్, ఏపీలోని అనకాపల్లికి చెందిన మైలపల్లి శివ, కారే సింహాచలం, వంక విశాఖ అలియాస్ ఇషాక్, నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీకి చెందిన ఎరిపల్లి బాబుజీ అలియాస్ బావొజి, చావల తాతారావు, చావల బంగారిలు నాగార్జునసాగర్ లో చేపల వ్యాపారం చేస్తుంటారు. జవహర్ లాల్, రమేశ్, శివలు హైదరాబాద్‌కు చెందిన రాజు, జగన్ విజయవాడకు చెందిన వెంకన్న, లోకేశ్‌ను ఏజెంట్లుగా నియమించుకున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల నుండి హైదరాబాద్, విజయవాడ లాంటి ప్రాంతాలకు వలస వచ్చిన వారిని టార్గెట్‌గా చేసుకుని ఉపాధి కల్పిస్తామని నెలకు రూ.15 వేల జీతం, రోజుకి కేవలం 2 గంటల పని, ఉచిత ఆహారంతో పాటు మద్యం ఇస్తామని మాయ మాటలు చెప్పి ఇక్కడకు తీసుకు వస్తారని చెప్పారు. వారిని విజయవాడ, హైదరాబాద్ నుండి దేవరకొండలోని మల్లేపల్లికి పంపుతారని చెప్పారు. మల్లేపల్లిలో వీరిని ఇక్కడున్న చేపల వ్యాపారులు తమ వెంట తీసుకు వెళ్తారు. రాత్రి సమయంలో బైక్‌లపై బాణాలకుంట, వైజాక్ కాలనీలోకి తీసుకెళ్లి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, ఆధార్ కార్డులు తీసుకుని కృష్ణా నదీలోని ఐలాండ్‌లకు పంపిస్తారని చెప్పారు.

ఎలాంటి సదుపాయాలు లేని ఐలాండ్‌లో కేవలం ప్లాస్టిక్ కవర్ ఇచ్చి అక్కడి నుండే చేపలు పట్టాలని ఆదేశిస్తారు. చుట్టూ నీరు ఉండడం వల్ల వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రతిరోజు వారిని చేపలు పట్టడం, చేపల వలలు లాగడం లాంటి పనులకు వినియోగిస్తారని చెప్పారు. కేవలం రెండు పూటలు మాత్రమే భోజనం అందిస్తారన్నారు. పని భారం ఎక్కువైందని, పనికి డబ్బులు ఇవ్వాలని కోరితే చిత్రహింసలు పెడుతూ వాతలు కూడా పెడతారని తెలిపారు. విజయవాడ, హైదరాబాద్‌లో ఏజెంట్లుగా ఉన్న రాజు, జగన్, లోకేశ్, వెంకన్న పరారీలో ఉన్నారని, త్వరలో అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఎవరితోనైనా వెట్టి చేయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ కేర్ వారికి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, కార్మిక శాఖ అధికారి అరుణకుమారి, సీడబ్ల్యూసీ చైర్మన్ చింతకృష్ణ, బాలల పరిరక్షణ అధికారి కేసాని గణేశ్ గౌడ్, సీఐలు నవీన్, బీసన్న, ఎస్ఐలు దొరెపల్లి నర్సింహులు, నాగేంద్రబాబు సిబ్బంది పి.మహేశ్, ఆర్.రాజు, ప్రశాంత్, వై. నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు చేస్తున్న 11 వేల యూట్యూబ్ ఛానల్స్‌ని తొలగించిన గూగుల్

న్యూ డిల్లీ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దిగ్గజ సంస్థ గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ దేశాలకు సంబంధించి అసత్య ప్రచారాలు చేస్తున్న 11 వేల యూట్యూబ్ ఛానల్స్‌ని గూగుల్ తొలగించింది. ఇందులో ప్రధానంగా చైనా, రష్యాకు చెందినవే టాప్ లిస్టులో ఉన్నాయి. చైనాకు చెందిన 7,700 ఛానెల్స్ భారత్‌లో రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి.. ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ.. పలు వీడియోలు చేస్తున్నాయని ఆరోపణల నేపథ్యంలో వాటిని తొలగించింది.రష్యాకు చెందిన 2వేలకు పైగా యూట్యూబ్ ఛానెల్స్ ఇతర వెబ్‌సైట్లను తొలగించినట్లు గూగుల్ వెల్లడించింది. ఉక్రెయిన్, నాటోలను విమర్శిస్తూ.. రష్యాకు మద్దతిచ్చేలా వీటిలో సమాచారం ఉందని పేర్కొంది. ఈ రెండు దేశాలతో పాటు ఇరాన్, టర్కీ, ఇజ్రాయెల్, రొమేనియా, అజర్‌బైజాన్, ఘనాకు చెందిన యూట్యూబ్ ఛానల్లను గూగుల్ తొలగించింది. ఆయా దేశాలకు చెందిన ఛానల్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా.. మత విద్వేశాలను రెచ్చగొట్టేలా అసత్యాలు ప్రసారం చేస్తున్నందు వల్ల ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది.

# రీకాల్ మేనిఫెస్టో అంటూ అసత్యాలతో తిరిగేవారిని తరిమికొట్టాలి: మంత్రి గొట్టిపాటి

అమరావతి జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రీకాల్ మేనిఫెస్టో అంటూ అసత్యాలతో తిరిగేవారిని తరిమికొట్టాలి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు నిచ్చారు.. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం వెంపరాలలో గొట్టిపాటి పర్యటించారు. వవ సన్నర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి పార్టీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నిలదీయాలని తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా ఇంటింటికి వెళ్లారు. రూ. 5 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన రహదారికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు,



ప్రారంభోత్సవాలు చేశారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని గొట్టిపాటి రవికుమార్ తెలియజేశారు.




విశాఖ రసజ్ఞ వేదిక మరియు రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఆహ్వానం

2025 రావిశాస్త్రి సాహితీ పురస్కార సభ

పురస్కార గ్రహీత
శ్రీ దాట్ల దేవదానం రాజు
ప్రముఖ కథకులు, కవి
కలైమామణి, కళారత్న, తెలుగురత్న పురస్కార గ్రహీత

| | |
|---|---|
| స్వాగతం | : శ్రీ రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి |
| సభాధ్యక్షులు | : డా॥ గండికోట రఘురామారావు |
| పురస్కార గ్రహీత పరిచయం | : డా॥ ప్రయాగ సుబ్రహ్మణ్యం |
| పురస్కార గ్రహీత సత్కారం, దాట్ల దేవదానం రాజు కథా సంపుటి 'మనిషి లోపలి నీడ' ఆవిష్కరణ | : డా॥ టి. రవిరాజు, ముఖ్య అతిథి |
| పురస్కార ప్రదాత | : డా॥ రాచకొండ నృసింహ శర్మ |
| ఆత్మీయ అతిథి | : డా॥ డి.వి. సూర్యారావు |
| గౌరవ అతిథి | : డా॥ శిఖామణి |
| పురస్కార గ్రహీత మనోగతం | : శ్రీ దాట్ల దేవదానం రాజు |

అందరూ ఆహ్వానితులే

డా॥ రాచకొండ నృసింహ శర్మ    డా॥ గండికోట రఘురామారావు

వేదిక : విశాఖ పౌర గ్రంథాలయం, ద్వారకానగర్, తేదీ : 30-07-2025, బుధవారం, సా॥ 6.00 గం॥లకు

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

## -రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
## - మేకప్, హెయిర్ పై సెమినార్

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




పేర్కొన్నారు.

మంగళవారం వేములవాడ పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్లో మహిళా బ్యూటీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మేకప్, హెయిర్ పై సెమినార్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతీ ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

వారు మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలని అన్నారు. తాము ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులను అప్ గ్రేడ్ చేసుకుంటూ ముందుకు పోవలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని అన్నారు.

అందులో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు చేయూత ఇస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, కవిత, స్రవంతి, మాధవి, సప్న, మంజుల, జ్యోతి, తదితరులు ఉన్నారు.

# బాలికలు వంటింట్లోంచి పోటీ ప్రపంచంలోకి అడుగు పెట్టాలి

## - కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వం వికాస నిపుణులు



హైదరాబాద్, జులై 22:డిజిటల్ యుగపు యువతులు, బాలికలు చదువుల తల్లి సరస్వతిని నమ్మి విద్యావంతులై వంటింటి కుందేళ్లు కాకుండా పోటీ ప్రపంచంలో రాణించే మహారాణులుగా ఎదగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ రోజు కరీంనగర్ రిజినల్ స్పో ర్ట్స్ స్కూల్ ఆవరణలో లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్ క్లబ్బులు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ పతాక ఆమోద దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మాట్లాడుతూ 22 జూలై 1947 రోజున నాటి భారత రాజ్యాంగ సభ మన జెండాను ఆవెూదించడం ఒక స్వతంత్ర భారతంలో చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయిందని అన్నారు. మచిలీపట్నానికి చెందిన తెలుగు తేజం పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం మధ్య అశోకుడి ధర్మ చక్రం చేర్చబడిందని, త్రివర్ణాలు ధైర్యం, త్యాగం, శాంతి, ఐక్యత, సంపద, ప్రగతి లాంటి అంశాలను సూచిస్తున్నానని పేర్కొన్నారు. మన వ్యక్తిగత, కుటుంబ, పౌర సమాజ సమస్యల పరిష్కారానికి ఏకైక శక్తివంతమైన ఔషధం విద్య మాత్రమే అని నమ్ముతూ, ఇష్టపడుతూ కష్టపడి చదవాలని ఉద్బోధ చేశారు. జాతీయ పతాక ఆవెూద దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ బాధ్యులు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డా బుర్ర మధుసూదన్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొత్వాల్ శ్రీనివాస్ సభాధ్యక్షత వహించగా లీడ్ ఇండియా బాధ్యులు లయన్ ఎం. మహెందర్, పాఠశాల ఉపాధ్యాయులు గుండు రమణయ్య, సాల్మన్ రెడ్డి, బి. శ్రీనివాస్, జి. శ్రీనివాస్, రమేష్, అనంత కుమార్, జి. వేదవతి, జి. మాదవీలత, తదితరులతో పాటు 180 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# ఇకపై స్కూళ్లలోనే ఆధార్ కార్డు అప్‌డేషన్.. యూఐడీఏఐ కీలక నిర్ణయం!

న్యూఢిల్లీ, జులై 22:చిన్న పిల్లల ఆధార్ కార్డుల అప్‌డేషన్ విషయంలో తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలను స్కూల్‌లో చేర్పించే సమయంలో బాల ఆధార్ కార్డులు తీసుకుంటున్నారు. కానీ వారికి ఐదేళ్లు దాటిన తర్వాత ఆధార్ కార్డు అప్‌డేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలా ఐదేళ్ల వయసు దాటిన తర్వాత ఆధార్ కార్డు అప్‌డేషన్ చేయించుకోని చిన్నారులు దేశవ్యాప్తంగా ఏడు కోట్ల మందికిపైగా ఉన్నట్లు యూఐడీఏఐ తాజాగా వెల్లడించింది. అలాంటి వారికోసం యూఐడీఏఐ కొత్త వెసులుబాటు తీసుకొస్తోంది. పిల్లలు చదువుకునే స్కూళ్లలోనే ఆధార్ అప్‌డేషన్ చేసే విధంగా ఒక ప్రాజెక్టును ప్రారంభించినట్లు యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ తెలిపారు.అనేక ప్రభుత్వ పథకాల అమలులో ఆధార్ కార్డు కీలకమని.. ప్రతి చిన్నారికి అవసరమైన ప్రయోజనాలు సమయానికి అందాలంటే ఇది తప్పనిసరి అని భువనేశ్ కుమార్ తెలిపారు. అందుకే పాఠశాలల ద్వారా ఈ ఆధార్ కార్డు అప్‌డేషన్ ప్రక్రియను సులువుగా పూర్తి చేయాలని అనుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి జిల్లాకు బయోమెట్రిక్ మెషిన్లను పంపించి, ప్రతి పాఠశాలలో ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియను అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి స్కూల్‌కు వెళ్లి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షిస్తున్నామని.. మరో 45 నుంచి 60 రోజుల్లో ఇది సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

ఆధార్ కార్డులో తప్పులు దొర్లకుండా ఉండాలంటే నిర్దిష్ట సమయానికి ఎంబీయూ తప్పనిసరి. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఐదేళ్ల వయసు దాటిన తర్వాత ఒకసారి ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించాల్సి ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఏడేళ్ల వయసు వచ్చే వరకు కూడా ఎంబీయూ పూర్తి చేయకపోతే ఆధార్ డీయాక్టివేట్ అయ్యే అవకాశం ఉంది. అందుకే నిర్దిష్ట సమయంలో ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవాలి. 5 నుంచి 7 ఏళ్ల మధ్య చిన్నారులకు అప్‌డేషన్ కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

అయితే ఏడేళ్లు దాటితే మాత్రం రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఇక 15 ఏళ్లు పూర్తయిన తర్వాత కూడా ఆధార్‌కు రెండోసారి ఎంబీయూ తప్పనిసరి. ఈ నేపథ్యంలో 15 ఏళ్లు పూర్తయిన పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం కూడా ఇదే విధానాన్ని స్కూళ్లు, కాలేజీల ద్వారా అమలు చేయాలని అనుకుంటున్నట్లుగా భువనేశ్ కుమార్ తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాహిత్య అకాడమి

ప్రముఖ సాహితీవేత్త
'స్వేచ్ఛా కవిత్వం' సృష్టికర్త
కీ॥శే॥ మాదిరాజు రంగారావు గారికి
అక్షర నివాళి



1935–2025

మాదిరాజు రంగారావు గారి
జీవితం–సాహిత్యంపై
డా.నాళేశ్వరం శంకరం గారి ప్రసంగం

తేది: 24.07.2025, సమయం : ఉ॥ 11.00 గంటలకు
వేదిక: తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయం

సాహితీవేత్తలు, అభిమానులు,
కుటుంబసభ్యులు పాల్గొంటారు.

ఆహ్వానించువారు
డా.నామోజు బాలాచారి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి


# సిఐ బత్తుల సత్యనారాయణ సస్పెన్షన్ ఎత్తివేసిన అధికారులు...

## – పోలీసుల సమగ్ర విచారణలో నిజాయితీని నిరూపించుకున్న సిఐ సత్యనారాయణ..
## – తిరిగి ఇల్లందు సీఐ నుండి టేకులపల్లి సిఐ గా బదిలీ చేసిన అధికారులు..

ఇల్లందు, జూలై 22 (నేటినిజం ప్రతినిధి) :ఆడపిల్లకి న్యాయం చేయాలని తపనపడ్డ సిఐ బత్తుల సత్యనారాయణ పై తప్పుడు ఆరోపణలు సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించి సిఐ బత్తుల సత్యనారాయణ ను సస్పెన్షన్ వేసిన సంగతి అందరికి తెలిసిందే..తిరిగి ఇల్లందు నియోజకవర్గం టేకులపల్లి సిఐ గా బత్తుల సత్యనారాయణ కు బాధ్యతలు అప్పగించడంతో హర్ష వ్యక్తం చేసిన ప్రజలు. ఆడపిల్లకి న్యాయం చేయాలని ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ చేసిన పోరాటంలో కొంతమంది అధికారులను తప్పుదోవ పట్టించి సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేసే విధంగా ఒత్తిడి తెచ్చారన్నారు..సిఐ చేయని తప్పుకు బలి కావడంతో ఇల్లెందు నియోజకవర్గంలో అలజడి ఏర్పడింది..వాస్తవాలు అధికారులకు తెలవాలని నేను చేసిన పోరాటంలో పోలీస్ శాఖ స్పందించి సిఐ బత్తుల సత్యనారాయణ యాదవ్ పై సమగ్ర విచారణ చేపట్టారు, ఈ విచారణలో సిఐ సత్యనారాయణ ఎలాంటి తప్పు చేయలేదని నివేదిక రావడంతో వెంటనే టేకులపల్లి సిఐ గా బాధ్యతలను అప్పగించారు. సిఐ సత్యనారాయణ పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల యావత్ తెలంగాణ మొత్తం గర్విస్తుందన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజ సహకారం అవసరం : చింత యాదగిరి

నల్గొండ, జులై 22: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు సమాజ సహకారం అవసరం అని కట్టంగూర్ మండలం యరసానిగూడెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం చింత యాదగిరి అన్నారు.

మంగళవారం యరసానిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామ యువత ఆకిటి వినోద్, ఆకిటి నవీన్, ఆకిటి మధు, భరత్ వారి కటుంబ సభ్యుల సహకారంతో వారి మాతృమూర్తి పుష్పలత జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు రూ.20 వేల విలువ గల షూస్, సాక్స్, బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ..దాతలు ఇదేవిధమైన సహకారం అందించడం ద్వారా విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుడిగెపాక శ్రీనివాస్, గాలి సంధ్యారాణి, శంకర్, తరాల పరమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# జిల్లాల పేర్ల మార్పుకు కొత్త కమిటీ.. ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం !

అమరావతి, జులై 22:ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై కీలక నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ప్రాంతీయ హక్కులు, చారిత్రక, సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ మార్చాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి.

సబ్‌కమిటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, జనార్ధన్‌రెడ్డి, రామానాయుడు, నాదెండ్ల, సత్యకుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లతో పాటు సరిహద్దుల సవరణలపై ప్రజల నుంచి వచ్చే సూచనలు, విజ్ఞప్తులను సమగ్రంగా పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తారు.

ప్రజల అభిప్రాయాలను పారదర్శకంగా సేకరించి, చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక విలువలు, ప్రాంతీయ గుర్తింపు వంటి అంశాలను దృష్టిలో ఉంచి కమిటీ తన పరిశీలన జరుపుతుంది. అధ్యయన ఫలితాలను సమగ్ర నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పించి తుది నిర్ణయానికి మార్గదర్శనం చేస్తుంది.

ప్రజలు పంపిన సూచనలు, అభిప్రాయాలను పూర్తిగా గౌరవిస్తూ, నిర్దిష్ట వ్యవధిలో నివేదికను సమర్పించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను ప్రజా అభిప్రాయాలను ప్రతిబింబించే కీలక దశగా ప్రభుత్వం భావిస్తోంది.

ఈ నివేదిక ఆధారంగా జిల్లా పేర్ల మార్పు, సరిహద్దుల సవరణలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా రెపరెపలాడించాలి

## – బిజెపి వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ డా. చెన్నమనేని వికాస్ రావు
## – కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

### స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): ప్రతినిధి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని, నాయకులు కార్యకర్తలు బిజెపి గెలిపే లక్ష్యం కావాలని, కాషాయ జెండా రెపరెపలాడించాలని బిజెపి వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు అన్నారు. మంగళవారం వేములవాడ అర్బన్ మండలంలోని నంది కమాన్ వద్ద ఫంక్షన్ హాల్ లో భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు హాజరై ఆయన మాట్లాడుతూ అర్బన్ మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసి గెలవాలని కష్టపడ్డ కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత పార్టీగా మా పైన ఉన్నది అని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు వార్డు స్థాయి నుండి జెడ్పిటిసి స్థాయి వరకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు తప్పకుండా బరిలో ఉండాలని వారు సూచించారు. నేడు భారత జనతా పార్టీ గ్రామ, మండలాల్లో బలమైన శక్తిగా అవతరించింది అన్నారు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్రామాల మండలాల అభివృద్ధి కోసం కట్టుబడి పని చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ మండల ఎన్నికల కన్వీనర్ లింగంపల్లి శంకర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వరరావు మాజీ అధ్యక్షులు ఏ రెడ్డి రాజిరెడ్డి జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన




కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్ రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు జింక అనిల్ ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్ నర్సింగోజు శంకర్ ఉపాధ్యక్షులు జింక శ్రీనివాస్ ఎరుగోక్కుల రమేష్ శ్రీనివాస్ రెడ్డి రాజు మోర్చాల అధ్యక్షులు సంతోష్ యాదవ్ గోనె భాస్కర్ నాంపల్లి అరవింద్ కార్యదర్శులు కొలనూరి సంజీవరెడ్డి శేఖర్ చొక్కాల మధు అధికార ప్రతినిధులు కర్రె పవన్ విశ్వనాథం శ్రీధర్ చల్ల నరసయ్య నాయకులు రెడ్డవేని రాజు పోచంపల్లి భాను పేరంగాని మల్లేశం నాంపల్లి తిరుపతి ముదికే రాములు బాలకృష్ణ కంసాని రాము నాగుల సురేష్ జక్కుల మధు తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజా ప్రభుత్వానికి అండగా ఉందాం : ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ, జులై 22:: ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా ఉందామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం ఆయన చిట్యాలలో కొత్త రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

చిట్యాల మండలంలో 1,600 రేషన్ కార్డులు , 500 పైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజల కోసం జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నామని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లె కాల్వలను పూర్తి చేస్తున్నట్లు చెపపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ఎస్ పి జయలక్ష్మి, మార్కెట్ చైర్మన్ నర్రా వినోదమోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాసు, గుడిపాటి లక్ష్మీనరసింహ, జడల చిన్న మల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, మారగోని ఆంజనేయులు, బట్టు ఐలేశ్, ఏనుగు రఘుమారెడ్డి, జనగాం రవీందర్, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పరిశోధనల్లో రాణించేలా ప్రోత్సహించాలి : ఎంజీయూ వీసీ

## –ఘనంగా నల్లగొండ ఎన్జీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం
## – మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం




నల్గొండ, జులై 22: డిగ్రీ స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనల్లో రాణించేలా అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (ఎన్జీ) వ్యవస్థాపక దినోత్సవం, వివిధ కోర్సుల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల 69 సవత్సరాలు పూర్తి చేసుకుని 70వ సంతంలోకి అడుగు పెట్టడం అభినందనీయమన్నారు. స్వయం ప్రతిపత్తి కళాశాలలు పరిశోధనకు పెద్దపీట వేయాలని కోరారు. అధ్యాపకులు పాఠం చెప్పడంతోనే సరిపెట్టుకోకుండా పరిశోధనలో నిమగ్నం కావాలని సూచించారు.

తెలంగాణ కళాశాల విద్యా సంయుక్త సంచాలకుడు డా.డి.ఎస్.ఆర్.రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగ ప్రకటనను గమనిస్తూ సిద్ధం కావాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ85 ఇక నుంచి ప్రతి సంవత్సరం మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి డా.జి.ఉపేందర్ రెడ్డి, తెలంగాణ కళాశాల విద్య విశ్రాంత సంయుక్త సంచాలకులు డా.జి.యాదగిరి, ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసరాజు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, ఉమెన్స్ కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.రాజారాం, కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా.కృష్ణప్రసాద్, విశ్రాంత ఆధ్యాపకుడు గుండెబోయిన లింగయ్య, ఎన్జీ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డా. బత్తిని నాగరాజు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డీఏపీ ఎరువుల లభ్యతపై రాజ్యసభలో కేంద్రమంత్రి కీలక ప్రకటన..!

న్యూఢిల్లీ, జులై 22:దేశీయ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారతదేశం 9.74 లక్షల టన్నుల డై–అమ్మోనియం ఫాస్ఫేట్ (అంఖ)ని దిగుమతి చేసుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

ప్రస్తుత సంవత్సరానికి డీఏపీ దిగుమతికి గణాంకాలను రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ రాజ్యసభలో వెల్లడించారు. భారతదేశం ఏప్రిల్‌లో 2.89 లక్షల టన్నులు, మేలో 2.36 లక్షల టన్నులు, జూన్‌లో 4.49 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని చెప్పారు.

2024–25 ఆర్థిక సంవత్సరంలో 45.69 లక్షల టన్నులు, 2023–24 ఆర్థిక సంవత్సరంలో 55.67 లక్షల టన్నులు, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 65.83 లక్షల టన్నులు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో 54.62 లక్షల టన్నులు, 2020–21 ఆర్థిక సంవత్సరంలో 48.82 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని వివరించారు.

యూరియాను 2024–25లో 56.47 లక్షల టన్నులు, 2023–24లో 70.42 లక్షల టన్నులు, 2022–23లో 75.80 లక్షల టన్నులు, 2021–22లో 91.36 లక్షల టన్నులు, 2020–2లో 98.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్లు వివరించింది.

ఖరీఫ్ నేపథ్యంలో రైతుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన ఎరువులు ఉన్నాయని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల అవసరం గతేడాది కంటే ఎక్కువగా ఉందన్నారు. రుతుపవనాలతో పాటు సాగు విస్తీర్ణం పెరిగింది.

ఏప్రిల్ 2010 నుంచి కేంద్రం ఫాస్ఫేటిక్, పొటాసిక్ ఎరువుల కోసం పోషక ఆధారిత సబ్సిడీ విధానాన్ని అమలు చేసింది. ఎరువుల డిమాండ్, ఉత్పత్తి మధ్య అంతరాన్ని దిగుమతుల ద్వారా తీరుస్తామని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ చెప్పారు.

భౌగోళిక రాజకీయ కారణంగా సరఫరాలో గొలుసులో ఎదురైన అంతరాయాల ప్రభావాన్ని తగ్గించేందుకు.. ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాను చేసేలా డీఏపీ ఉత్పత్తి చేసే దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.